# నీ వెనుకే నీ నీడ.

కె.కె. రఘునందన

**జీవితాన్ని విజయవంతంగా నెట్టుకు రావటంలో కృతకృత్యుడు కానందుకు అనవరతం బాధపడే మధ్యతరగతి కుటుంబీకుడు రాధాకృష్ణయ్య.**

అతని స్థితిగతులు- అతని బ్రతుకును అడుగడుగునా వెక్కిరిస్తూ మర్రి వూడలాంటి బలమైన నిరాశా ఛాయలు మనసులో జీరాడి పారాడుతున్నాయి. మదిలో ఒక చిన్న రేణువు లాంటి ఆశ కూడా- ఒక్కో క్షణం కనుచూపు మేరలో కానరాని చిట్టచీకటిలో కొట్టుమిట్టాడుతూ బ్రతకాల్సి రావటానికి ఒకే ఒక్క కారణం రాధాకృష్ణయ్య ఆడపిల్లల తండ్రి కావటమే!

అపుడపుడు మేఘాల చాటు మాటులను తప్పించుకుని తొంగి చూసే అందమైన చల్లని చందమామలా ఒకొక్కప్పుడు ఆశల వెన్నెల ఎదనిండా కాసిన క్షణం మధురాతి మధురం!

కాని ఆ మధురమే చేదుగా మారటానికి క్షణం పట్టని సంఘటన లెన్నో ఎదురైనాయి రాధాకృష్ణయ్య మనుగడలో.

పెద్దకూతురు సునాదను ఎలాగో మేనల్లుడుండబట్టి - చిన్నప్పటి నుంచీ అనుకోబట్టి- అదీ వాడు దాన్ని చేసుకుంటానని ఒప్పుకోబట్టి మెల్లగా కట్నం బాధ లేకుండా ఏదో అచ్చట- ముచ్చట లని తీర్చేసి కూతురును కుమారి నుండి శ్రీమతిగా మార్చాడు.

ఎటొచ్చీ- ఈ కాలం గాని కాలంలో మనుషులు వెర్రికోరికలను మనసుల్లో పాతేసుకుని, మనుషుల నడుమ వుండేది కేవలం పచ్చ నోట్ల సంబంధమే నన్నట్లు వాదిస్తూంటే- రెండో కూతురు సారిక అందాల బొమ్మ, రవ్వల దివ్వే అయినా ఏ పెండ్లి కొడుకు వివాహ బాంధవ్యం కోసం ప్రాకులాడతాడని?

కొద్దో, గొప్పో కట్నకానుకలు యివ్వగలడు రాధాకృష్ణయ్య. కానీ అంతమాత్రం చేత కూతురి శ్రీపాదం మెట్టినింట్లో మోపించాలన్న కోరిక మాత్రం విఫలంగా నవ్వేసి అతన్ని అథః పాతాళానికి అణగ తొక్కేసింది.


రంగరించిన జీవితానుభవాలు కనుల ముందర ఓ సారి కదిలినపుడల్లా ఆలోచనల దాడి ప్రారంభమౌతుంది రాధాకృష్ణయ్యలో.

ఆ సమయంలోనే తన తోడు-నీడల్ని త్రుళ్ళగొట్టి ఈ ప్రాపంచిక భవబంధాలతో శాశ్వత వీడ్కోలు కొని నిష్క్రమించిన అర్ధాంగి, తల్లి లేకపోయినా ఆ తల్లి సర్వ బాధ్యతలు తన భుజాలపై వేసుకుని లాలించి పెంచి పెద్ద చేసిన కూతుళ్ల జీవితాలు పరుగెత్తుకొస్తాయి.

సునాద గురించి అతనికి నిశ్చింతే!

కేవలం అతని మస్తిష్కం నిండా సారికే.

ఎటు వెళ్ళినా ఇదే స్ఫురణకు వచ్చి గుండె కోత మొదలౌతుంది. కాని, ఈ ప్రాకులాటలు, లంపటాలు ఏవీ అర్థంకాని సారిక మాత్రం త్రుళ్ళుతూ, పరవళ్ళు తొక్కే వయసు గిలిగింతలలో ఓలలాడుతూ



శుభ్రజ్యోత్స్నలా వెలుగొందుతూంది.

తన మానసిక అనిశ్చలత... ఎద గూటిలో దాగిన దిగులు బహిరంగం కాకుండా అతి జాగ్రత్తగా మసలుకుంటున్నాడు రాధాకృష్ణయ్య.

ఆ రోజు సైతం అతనలా ఆలోచనల వూబిలో కూరుకు పోతున్న వేళ- "నాన్నా! మీ కోసం ఎవరో!" అని సారిక చెప్పేదాకా ఏదో మాయలో వున్న భ్రాంతి నుండి తేరుకుని వెళ్లాడు.

బయట పావనశాస్త్రి!

రాధాకృష్ణయ్య కళ్ళలో ధవళచ్ఛాయ!

కోరి ముందుకొచ్చి కూసిన కోకిల ఆమని గీతికలాంటి ఆగమన మది.

"శాస్త్రీ! నీ కోసం ఎంత ఎదురు చూస్తున్నానో తెలుసా!" అని రాధాకృష్ణయ్య అంటుంటే ఆ పదాలలొంచె తేనె వూటలాంటి ఆనందం త్రుళ్ళింది.

"వెళ్ళిన పని సాధించుకు రావాలనే తపనలో కొద్ది ఆలస్యం అయితే అయింది గాని... మనం అనుకున్నది నెఱవేరింది. సారికను చేసుకోవటానికి అంతా అంగీకరించారు కానీ,"

"ఆఁ ఏంట్రా! అపావేం? చెప్పు... కానీ,..." రాధాకృష్ణయ్య కొండంత ఆశ్చర్యం వెల్లడించాడు.

"నువ్వు చెప్పిన అంకెకి కుదర్చలేక పోయినందుకు క్షమించు... మరో అయిదెక్కువయింది".

"అంటే ఇరవై వేలా!" గుండె బితుకు బితుకులాడింది.

"మొన్న అదవివరం సంబంధానికి పదిహేను దాకా వెళ్లావా లేదా! అక్కడికెంత మరో అయిదు వేలే! ఒరే! నీకున్నదింకొక్క కూతురే! దాంతో అన్ని బాధ్యతలు గట్టెక్కిపోతాయి. ఊఁ కొట్టు...." అని భుజం పట్టుకు కుదిపాడు శాస్త్రి.

అతని మాటల ప్రభావం రాధాకృష్ణయ్యపై బాగా పనిచేసింది. సారిక వివాహం జరగాలి. అదీ సాధ్యమైనంత త్వరగా!

మనసు మారుమూలల్లోంచి ఏదో సంకోచం, భయం బయలుదేరినా వాటిని వ్యతిరేకిస్తూ వీధిలోకి నడిచాడు.

అనుకున్నంత సులువుకాదు పని కావటం అని తెలియటానికి రెండు రోజులు పట్టింది. తర్వాత ఓ మనిషిలో దేవుడు దూరాడేమోనన్నట్టుగా-రాధాకృష్ణయ్యకు అప్పు ఇస్తానన్న భరోసా లభించింది.

ఆ నమ్మకం వేయి ఏనుగుల బలాన్ని ప్రసాదించింది.

ఇంత కాలానికి నిశ్చింతగా వూపిరి పీల్చుకున్నాడు.

జీవితం కొలది కాలమైనా ఎన్ని ఝు ఝూటాలు!!

పావనశాస్త్రితో పాటు రాధాకృష్ణయ్య కూడా బయలుదేరాడు. శాస్త్రి చెప్పినట్టుగా లేదు వారింటి వాతావరణం. వారందరి మొహాలలో ఏదో వెలితి తేటతెల్లమౌతూంది. ఆసరికే వారింటికి బంధువులెవరో పాదం మోపిన ఛాయలు బయట విడిచిన పాదరక్షల ద్వారానూ, లోపల వినిపిస్తున్న నవ్వుల ద్వారానూ ప్రస్ఫుటమైనాయి.

అరికాలి క్రింద పేడ పురుగు కదిలినట్టుగా అనిపించింది రాధాకృష్ణయ్యకు.

తనని రాగానే ఆప్యాయంగా పలకరించి, ఆదరించి మంచిగా మాట్లాడి అంగీకరిస్తారనే అతని అందమైన వూహ తలక్రిందులైంది.

పావనశాస్త్రిని చూసిన ఓ పెద్దాయన బయటకు వచ్చి- "ఇలా నాతో రండి..." అని తీసుకెళ్లి ఓ అయిదు నిముషాల తర్వాత బయటపడ్డారు.

"పద రాధాకృష్ణయ్యా! వచ్చిన పనయింది" అని పావనశాస్త్రి చెబుతున్నప్పుడే ఏదో అపశృతి తొంగి చూసింది.


"మనకంటే అయిదువేలు ఎక్కువ యిస్తామని ముందుకు రావటంతో వాళ్ళు అటు మొగ్గారు. నేను ఆ మధ్య చెప్పినపుడే డబ్బు వ్యాపగించితే.... అయినా ఈ రోజుల్లో డబ్బు మన చేతుల్లో వుండాలి కాని, డబ్బు చేతుల్లో మనం వుండకూడదు." చిరాకుపడ్డాడు.

"నా పరిస్థితి నీకు తెలుసుగా... ప్రస్తుత కర్తవ్యం" దీనంగా ఆవేదనని ఒడిసిపట్టి అడిగాడు రాధాకృష్ణయ్య.

"నెత్తి బాదుకోవటం. చేతులు జారిపోయింది. ఇంకేమిటి చేస్తాం. ఈ రోజుల్లో ఎవరికయినా స్వార్థం తప్పదు. నిజానికి మీ అమ్మాయి ఆ అబ్బాయికి నచ్చింది. కానీ డబ్బు తల్లిదండ్రులకు నచ్చిందీ. ఏం చేస్తాం. తలరాత కూడా బాగుండాలి". ఎన్నిసార్లు నొచ్చుకున్నాడో!

వాళ్ళ వూరి బస్సు కనిపిస్తే ఎక్కి వెళ్లిపోయాడు పావనశాస్త్రి.

ఎడారిలో ఒంటరి కోయిలలా మిగిలిపోయాడు రాధాకృష్ణయ్య.



దగ్గరకొచ్చిన కూటిని కుక్క ముట్టినట్టు...

పెంచి జాగ్రత్త చేద్దామనుకున్న కోడిపిల్లను డేగ కరుచుకెళ్లినట్టు... హే భగవాన్! నీ తంత్రంలో ఇదో భాగమా!

ఈ ఒక్క అవకాశం ప్రసాదించమని నిన్ను ఎన్నిమార్లు జోహార్లర్పించానో.... కానీ అంతలోనే ఆశల దారాన్ని పుటుక్కున తెంపేశావు?!

ఇల్లు చేరినాసరే మానసిక భారం తగ్గుముఖం పట్టలేదు. జీవితం ఆమూలాగ్రం గ్రంథస్తం చేసినట్టుగా- తీపి చేదు అనుభవాలు జ్ఞాపకాలలోనికి చొచ్చుకు వస్తున్నాయి.

సారికపెండ్లి తనీ జన్మలో జరిపించలేడా!

ఆమె నుదుట కల్యాణ తిలకం దిద్దడానికి వరుడు ప్రపంచంలోనే లేడా.

తన చిట్టి తల్లి దురదృష్టవంతురాలు కాకూడదు.

ఎక్కడో తన బంగారబొమ్మ కంఠాన్ని అలంకరించటానికి పూలమాలతో వేచి వుంటాడు.

అన్న ఆశావాదంతోనే ఆలోచిస్తున్నాడు. కాని లోలోపల ఎలా సాధ్యం అని పీకుతూనే వుంది.

'మనసుంటే మార్గం వుండదా అంటారు'.

తనకు మనసు నిక్షేపంలా వుంది. కాని ఈ పరిస్థితి ఎలా ఎదుర్కోవాలో ఒక్క వుపాయం లేదా!

చాలాసేపు క్షుణ్ణంగా యోచించాడు.

తర్జనభర్జన పడ్డాడు.

చివరకు ఆ విషమ సమస్యకు ఓ చక్కటి వుపాయం రాధాకృష్ణయ్య బుర్రలోకి మెరుపులా దూసుకొచ్చింది.

మానవత్వ మెరిగిన అతని హృదయం అందుకు ప్రతిఘటించింది. కాని స్వార్థం ఆ అభిప్రాయంతో ఘర్షణపడి చివరికి తానే నెగ్గింది.

దాని ఫలితం రాధా కృష్ణయ్య ముఖాన పట్టిన చెమటను ఆత్రంగా తుడుచుకుని టేబిల్ దగ్గరకు వెళ్లి లైట్ ఆన్ చేసాడు.

లెటర్‌పాడ్ మీద పెన్ ఆనించిన క్షణం కూడా వివేకానికి- అంతరంగానికి యుద్ధమైంది. కానీ వివేకం తెల్ల మొహం వేసుకు వెళ్ళిన క్షణాన అతని చేతిలో పెన్ త్వరితంగా కదిలింది. ఎన్నో అక్షరాలు కూర్చిన పదాల్లో భావాల పరంపరను చివరగా చదివి బరువుగా నిట్టూర్చి- వుత్తరం మడిచాడు.

ఆ చివరి నిముషం దాకా కొట్టుకు లాడిన గుండెలో భీతి కొద్దిగా సడలింది.

★ ★ ★ ★ ★ ★

రోజొక యుగంలా గడిచింది. అలాంటి యుగాలు ఏడు దొర్లాయి. చివరికి ఒక రోజు అకస్మాత్తుగా పావన శాస్త్రి దిగాడు.

వచ్చీరాగానే కౌగలించుకుని- "ఒరే రాధా! నీకెక్కడో సిరి మిగిలుందిరా! లేకపోతే ఏమిట్రా! తప్పిపోయిందనుకున్న సంబంధం తిరిగి కుదరడం- ఈ రోజుదయమే వాళ్లదగ్గర్నుండి పోస్టులో వుత్తరం వచ్చింది. ఇదిగో చదువు" అని సూట్‌కేసులోంచి వుత్తరం తీసి రాధాకృష్ణయ్యకు అందించాడు.



## నాలుగార్లు 24 కాదు 454!

కపిల్ డెవిల్ "లార్డ్స్"లో అకస్మాత్తుగా విజృంభించాడు. ఎడ్డీ హెమ్మింగ్స్ (తాతగారంటారు అంతా 44 సం.లు) గారు వేసిన ఆఫ్ బ్రేకుల బ్రేకులు త్రెంచి వరసగా "నాలుగు ఆర్లు" కొట్టేసరికి "ఫాలో ఆన్" కోసం ప్యాడ్‌లు కట్టుకున్న సిద్ధూ, రవిశాస్త్రి పెవిలియన్‌లో ప్యాడ్‌లు విసిరి పారేసిహుర్రేమంటూ గెంతారు. అజ్జూ భాయి మీద బిషేన్ బేడీ నిన్నటిదాకా విరుచుకు పడ్డవాడు నాలిక్కర్చుకున్నాడు. ఎందుకో? మొదటిటెస్ట్‌ని రేడియోమీద వింటూన్నక్రికెట్‌లవర్స్‌అందరికీతెల్సు

కపిల్‌కి జతగా అవతల హిర్వాణీ వున్నాడు-బ్యాట్ పట్టుకున్నాడేకాని కాళ్లు వణుకుతున్నాయి తనకి. అమ్మయ్య!అనుకుని ఆతర్వాతి అవకాశం తీసుకుని హిర్వాణీ అవుట్ అయిపోయాడు. అయితేనేం ఇండియా ఫాలో ఆన్ తప్పించుకుని, ప్రతిష్ఠ కాపాడుకున్నది-కపిల్ కొట్టిన నాలుగార్లు ఆవిధంగా 454 స్కోరు సాధించాయి-లార్డ్స్‌లో యీసారి పరుగుల వర్షమే కురిసింది కాని యీ పిడుగుల సిక్సర్‌లు చిరస్మరణీయాలు!

***

చదివాడు రాధాకృష్ణయ్య.

అతని పెదాలు విలాసంగా చిరునవ్వుతో మొగలి రేకుల్లా విచ్చుకున్నాయి. "రాధా! సారిక అదృష్టం కాకపోతే వాళ్లకి చివరిక్షణంలో ఎవరో వ్రాసారుట వారు చేసుకోబోయే అమ్మాయి చెడు తిరుగుళ్ళు తిరిగిందని- అందుకే ఆ విషయం బయట పడకుండా అర్జంటుగా ఎవరి చేతనయినా అమె మెడలో తాళి కట్టించేయాలని చెప్పి కట్నం కూడా

## నీ వెనుకే నీ నీడ

ఎక్కువే ఇవ్వటం అందువల్లేనని.... కానీ వారికీ విషయం వుత్తరం ద్వారా తెలిసీ తెలియగానే కట్నం తక్కువ అని మొదట తిరస్కరించి అవమానించినందుకు బాధపడ వద్దని చెప్పి తిరిగి మన సారికనే చేసుకోవటానికి అంగీకరించి ముహూర్తాలు వీలైనంత త్వరగాపెట్టించమన్నారు." అని వివరించి విషయమంతా మరల చెప్పాడు

రాధాకృష్ణయ్య వుల్లం ఝల్లున వుప్పొంగింది.

ఈ ఆశ ఓ కొలిక్కి వచ్చేదాకా ఏ ఆధ్యంతు సృష్టించవద్దని భగవంతుని మనసారా స్మరించాడు

* * * * * * *

సారికను ఓ ఇంటి దాన్ని చేసి తన గుండెలపై భారం తొలగించు కున్నందుకు అందరి ఆడపిల్లల తండ్రుల్లాగా అవధిలేని సంతోషం అనుభవించాడు రాధాకృష్ణయ్య.

ఇంక జీవనరథం సాఫీ మార్గాన పడినట్లే!

ఈ అంతిమ జీవితం భక్తిచింతనతో గడిపేస్తే చాలు.

అలా హాయిగా కాలం నడుస్తోంది.

ఓ రోజు వుత్తరం- సారిక నుండి.

"నాన్నా!

అందరి తండ్రుల్లాగా మీ బాధ్యత మేర నన్నో ఇంటి కోడలిగా పసుపు కుంకుమలు కలకాలం నిలిచి వుండాలని ఆశీర్వదిస్తూ పంపారు. కాని కొందరి జీవితాల్లో వసంతాన్ని- మరి కొందరి జీవితాల్లో గ్రీష్మాన్ని నిలపాలని ముందే నిర్ణయించు కుంటాడేమో! దేవుడు!! ఎందుకో దేవుడి దృష్టి నా మీద చులకనయింది. నా సంసారం కార్తీక పౌర్ణమిలా వెలుగొందు తుందని ఎంతో గొప్పగా వూహించాను కాని ఆయన మొన్న మొన్నటి దాకా ఏ వ్యసనం లేని మంచి వ్యక్తి. కానీ నా దురదృష్టమో మరేమో, ఈ మధ్య ఓ ఫారిన్ ఫ్రెండుతో పరిచయం అయిన కారణంగా ఆయన ప్రస్తుతం మత్తు ఇంజక్షన్లకి బానిస. ఈ విషయం ఆ ఇంట్లో నాకు తప్ప మరెవరికీ తెలీదు అందుకే ఆ విషాన్ని నేను ఒక్కదాన్నీ గొంతులో మింగలేక కక్కలేక దాచుకున్నాను.

ఈ విషయం చెప్పి మిమ్మల్ని బాధ పెట్టడానికి మనస్కరించకపోయినా తండ్రి దగ్గర దాపరికం వుండరాదని మీ ముందర కూతురిగా వెళ్లబోసు కున్నాను

– ఇట్లు

సారిక"

ఉత్తరం చదివి హతాశుడైనాడు రాధాకృష్ణయ్య.

ఒక్కసారిగా కనుల్లో నీరు చిప్పిల్లింది.

ఘోరమైన వేదనతో మునిగి పోయింది గుండె

ఆ క్షణమే ఆవేదనతో వున్న రాధాకృష్ణయ్యను అంతరాత్మ నిలదీసింది. "ఒ నాడు నీ స్వార్థం కోసం- గుండెల మీద కుంపటిలా బావించిన నీ కూతురి మెడలో తాళి కట్టించాలన్న బలమైన కాంక్షతో మరో ఆడపిల్ల చెడ్డదనే మరకను వేసి- సుకరమైన నీరాజ మార్గం కోసం అడ్డు తొలగించు కున్నావు. ఫలితం ఈ రోజెలా ఎదురైందో నీ కళ్లతో చూస్తున్నావు అనుభవించు..." వికృతంగా నవ్వసాగింది

రాధాకృష్ణయ్యలో అసలు మనిషి పశ్చాత్తాపంతో చితికి పోవటం మొదలెట్టాడు.

o